క్లుప్తంగా

సర్వేపై అవగాహన ఉండాలి

గుడ్లవల్లేరు: నాన్ కమ్యూనికబుల్ హెల్త్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వేపై వైద్య సిబ్బందికి అవగాహన ఉండాలని డీఎంహెచ్‌ఓ గీతాబాయ్ అన్నారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె ఆశాడే సమావేశంలో మాట్లాడారు. త్వరలో ఏఎన్ఎంలు, ఆశాలు ఇంటింటికీ ఎన్‌సీడీ సర్వే చేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు

గుడివాడరూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం విధి విధానాలను సిద్ధం చేసిందని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు, శేరీదింటకుర్రు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు గోనెసంచులను రైతులకు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. ధాన్యం సరఫరాకు రవాణా ఖర్చులు, కూలీల చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఏఓ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి

గుడివాడరూరల్: గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని గుడివాడ హౌసింగ్ ఈఈ గుమ్మడి రత్నశ్రీ అన్నారు. మండలంలోని రామనపూడి గ్రామంలోని హౌసింగ్ కాలనీలో నిర్మిస్తున్న గృహాలను అధికారులతో మంగళవారం ఆమె పరిశీలించారు. ముందుగా లబ్ధిదారులను కలసి నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను సకాలంలో మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డీఈ రామోజీనాయక్ పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



పామర్రు: బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయుక్తం అవుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, నాయకులు గణేష్, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, శోభన్ బాబు, రమేష్, ప్రసాద్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో గుడివాడకు తృతీయ స్థానం

గుడివాడరూరల్: అనకాపల్లిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో గుడివాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాలుర విభాగంలో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో గుడివాడ కీర్తిని ఇనుమడింపజేశారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బహుమతులు అందజేసి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ పరిశీలకుడు మడకా ప్రసాద్ పాల్గొన్నారు.

కార్తిక దీపోత్సవం



మండవల్లి: స్థానిక నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాగులచవితి, కార్తిక మాసం పురష్కరించుకుని మంగళవారం రాత్రి శివలింగ అలంకరణతో దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హాకీ పోటీలకు పామర్రు జెడ్పీ విద్యార్థులు

పామర్రు: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు తమ హైస్కూల్ విద్యార్థులు అర్హత సాధించారని హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్లో విజేతలను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పమిడిముక్కల జెడ్పీ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పీ దుర్గా సందీప్, కార్తీక్ విజేతలుగా నిలిచారని తెలిపారు.

సురక్షిత తాగునీటితో విద్యార్థులకు ఆరోగ్యం

అడ్డాడ(పామర్రు): సురక్షిత తాగునీటి వలన విద్యార్థులు ఎంతో ఆరోగ్య వంతులుగా మారుతారని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలోని అరవింద హైస్కూల్లో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. రాజు వేగేసిన, జయప్రద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలకు ఆర్వో ప్లాంట్‌ను బహూకరించారు. పాఠశాల కరెస్పాండెంట్లు నాగార్జునరాజు, సూర్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ రమణమూర్తి పాల్గొన్నారు.

నీరు సాగేదెట్లా..!

వేలాది ఎకరాలకు నీరందించే డ్రెయిన్లు గుర్రపుడెక్క, తూడు, నాచు, కిక్కిసతో మేట వేసుకుపోయాయి. తూతూ మంత్రంగా తూడు నిర్మూలన పనులు చేపట్టడంతో నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. దీంతో చిన్నపాటి వర్షాలకు డ్రెయిన్లు ఎగతన్ని ముంపునకు గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలు సైతం ముంపు బారిన పడుతుండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పూడుకుపోయిన డ్రెయిన్లు
- పట్టించుకోని అధికారులు





పోలుకొండ రెగ్యులేటర్ వద్ద చంద్రయ్య డ్రెయిన్లో అవరోధంగా ఉన్న గుర్రపుడెక్క , (ఇన్‌సెట్‌లో) కిక్కిసతో నిండి రూపుకోల్పోయిన రాళ్లకోడు డ్రెయిన్

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో డ్రెయిన్లు పూడిక తీయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందివాడ మండలంలోని మేజర్ డ్రెయిన్ అయిన బుడమేరు గుర్రపుడెక్కతో మేట వేసుకుపోయింది. పుట్టగుంట వంతెన వద్ద నుంచి ఎల్ఎన్ పురం వరకు ఎక్కడ చూసినా గుర్రపుడెక్కే కన్పిస్తోంది. దీని వలన చిన్నపాటి వర్షాలకు డ్రెయిన్ పొంగి పొర్లి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలతో పాటు గ్రామాలు సైతం ముంపు బారిన పడుతున్నాయి. ఇటీవల సంభవించిన తుపాను, వరదల వలన పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారి రోజుల తరబడి గ్రామాలు నీటి దిగ్బంధంలో చిక్కుకున్నాయి. పంట పొలాలతో పాటు చేపల చెరువులు సైతం ముంచేసి రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. నందివాడ, రామాపురం, అరిపిరాల, వెన్ననపూడి, తుమ్మలపల్లి తదితర గ్రామాల్లోని మురుగునీటిని తరలించే పాత భూమికోడు గుర్రపుడెక్కతో రూపుకోల్పోయింది. ఫలితంగా నీరు సక్రమంగా ప్రవహించకపోవడంతో రైతులను నట్టేటముంచుతోంది. పోలుకొండ, ఎల్ఎన్పురం, రుద్రపాక, శంకరపాడు గ్రామాల్లోని మురుగునీటిని తరలించే రాళ్లకోడు డ్రెయిన్ కిక్కిసతో మూసుకుపోయింది. సుమారు ఏడు కిలో మీటర్ల మేర గుర్రపుడెక్క, కిక్కిసతో నిండిపోయి డ్రెయిన్ రూపురేఖలు మారిపోయాయి. దశాబ్దాల కాలంగా పూడిక తీయకపోవడంతో డ్రెయిన్ కిక్కిసతో దర్శనమిస్తోంది. పూడికతీయాలని రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. మరో మేజర్ డ్రెయిన్ అయిన నెహ్రాల్లీ డ్రెయిన్ పరిస్థితి ఇదే తంతు. డ్రెయిన్ 10 కిలో మీటర్ల మేర కిక్కిసతో నిండిపోయింది. గత పర్యాయం నీరు–చెట్టు రూపంలో టీడీపీ నాయకులు డ్రెయిన్ పూడికతీత పనులు తూతూ మంత్రంగా నిర్వహించి బిల్లులు చేసుకుని జేబులు నింపుకున్నారేగాని సక్రమంగా పూడిక తీయకపోవడంతో పరిస్థితి మరింత జఠిలంగా మారి రైతన్నలకు శాపంలా మారింది. మేజర్ అయిన చంద్రయ్య డ్రెయిన్‌దీ ఇదే పరిస్థితి. గుడివాడ మండలంలోని లింగవరం, నందివాడ మండలంలోని తమిరిశ, అనమనపూడి, గొంగ్లమూడి వంతెనల వద్ద భారీగా గుర్రపుడెక్క మేట వేసుకుపోయి నీటి ప్రవాహానికి అవరోధం కలిగిస్తున్నాయి. అధికారులు గుర్రపుడెక్క తొలగించే పనులను గాలికి వదిలేయడంతో నీరు సక్రమంగా సాగడం లేదు. రూరల్ మండలంలోని మోటూరు డ్రెయిన్‌దీ కూడా ఇదే పరిస్థితి.

తూతూ మంత్రంగా పనులు

డ్రెయిన్ల నిర్వహణకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం ఏడాది పొడవునా పనులు నిర్వహించేందుకు మెయింటెనెన్స్ నిధులను మంజూరు చేస్తుంది. టెండర్ల ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్లకు పనులు కేటాయిస్తున్నారు. కాంట్రాక్టులు తీసుకోవడమే కానీ పనులు చేసిన దాఖలాలు శూన్యం. బుడమేరు డ్రెయిన్‌కు సంబంధించి పుట్టగుంట నుండి ఎల్ఎన్ పురం వరకు దశాబ్దాల కాలంగా గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టిన దాఖలాలు లేవు. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తులు నీటి ప్రవాహం డ్రెయిన్లకు వచ్చిన సమయంలో పోలుకొండ రెగ్యులేటర్ వద్ద గుర్రపుడెక్క తొలగించకుండా మనుషుల సాయంతో డెక్కను కిందకు తోసేసి చేతులు దులుపుకుంటున్నారు. నెహ్రాల్లీ డ్రెయిన్, భూమికోడు, మోటూరు, రాళ్లకోడు డ్రెయిన్లకు సంబంధించి గుర్రపుడెక్క తొలగించిన పరిస్థితులు లేవు. అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై పూడిక, మెయింటెనెన్స్ పనులు చేయకుండానే బిల్లులు మంజూరు చేస్తున్నారని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు, పాలకులు దృష్టిసారించి పనులు సక్రమంగా జరిగేలా చర్యలు చేపట్టి డ్రెయిన్లకు మోక్షం కలిగించాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



డ్రెయిన్లలో గుర్రపుడెక్క, తూడు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తున్నా కాంట్రాక్టర్లు పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. పనులు నిర్వహించేలా చూడాల్సిన అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా నీరు సాగక డ్రెయిన్లు పొంగి చెరువులు, పంటపొలాలు, గ్రామాలను ముంచుతున్నాయి. పాలకులు దృష్టిపెట్టాలి.

– బి.అయ్యప్ప, ఎల్ఎన్‌పురం

పనులు చేయకుండానే బిల్లులు



ఏడాది పొడవునా డ్రెయిన్లలో పూడిక తీయడానికి ప్రభుత్వం నిధులు ఇస్తోంది. పూడికను పూర్తిస్థాయిలో తీయాల్సి ఉండగా కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా కెమికల్స్ స్ప్రే చేసి చేతులు దులుపుకుంటున్నారు. వరదలు వచ్చినప్పుడు తూడును తీయకుండా దిగువకు తోసేసి పని అయ్యిందనిపించుకుంటున్నారు. అధికారులు కాంట్రాక్టర్లకు సహకరించి బిల్లులు మంజూరు చేస్తున్నారు.

– కైలే అశోక్, రైతు గుడివాడ మండలం

సీసీ రోడ్డు పరిశీలన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణాన్ని క్వాలిటీ కంట్రోల్ జేఈ పి.సుధాకర్, పీఆర్ ఏఈ కమలేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, రూ.12 లక్షలతో, మరో రోడ్డు రూ.6 లక్షలతో మొత్తం 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రోడ్డును పరిశీలించారు. సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు పెరుమాళ్ల సత్యనారాయణ, క్వాలిటీ కంట్రోల్, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ మంచాల సరస్వతీ ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో ఈ పనులను చేపట్టారు. గ్రామంలోని బీటీ సీసీరోడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మరీదు వసంతరావు, కార్యదర్శి హారిక, పాలకవర్గ సభ్యులు కోటేశ్వరరావు, ప్రభు, అప్పాజీ, అనగాని రామకృష్ణ పనులు పర్యవేక్షించిన వారిలో ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



గుడివాడరూరల్: విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 23వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో గుడివాడ షైనింగ్ స్టార్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు స్కూల్ డైరెక్టర్ లింగమనేని స్రవంతి జగదీష్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన గౌహర్ జహా, లోహిత్‌రాజ్, మోహిత్‌నందలు ఆఫ్‌లైన్ కేటగిరిలో, మనస్విత్ ముఖర్జీ, రఫీక్ అహ్మద్, నాగూర్ షరీఫ్ ఆన్‌లైన్ కేటగిరిలో బహుమతులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు.

హక్కులకు భంగం కల్గిస్తే సహించేది లేదు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు: ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లకు రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించే విధంగా అధికార పార్టీ నేతలు ప్రవర్తిస్తే సహించేది లేదని పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పెదపారుపూడి మండలం ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో మండల పరిషత్, పంచాయతీలపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు, నాయకుల చర్యలు ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయన్నారు. అధికార మదంతో స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులను నిర్లక్ష్యం చేసి వారికి కేటాయించిన నిధులను అధికార పార్టీ నేతలకు కట్టబెట్టే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

కూటమి నేతల ఇష్టారాజ్యం

పెదపారుపూడి మండలంలో అధికారుల అండ చూసుకుని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లకు కేటాయించిన నిధులను వారి ప్రమేయం లేకుండా కూటమి నేతలు ఇష్టా రాజ్యంగా కేటాయింపులు చేస్తున్నారని అనిల్‌కుమార్ దుయ్య బట్టారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించకుండా అగౌరపరుస్తూ, అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజాప్రతినిధులను కించపర్చటం వారి కుసంస్కారానికి నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. దీనిని ఖండించాల్సిన నియోజకవర్గ పెద్ద దీనిని మరింతగా ప్రోత్సహించడమనే ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మంచి పద్ధతి కాదన్నారు. సత్వరమే దీనిని సరి చేసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులకు ఎల్లప్పుడూ తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. వారిపై ఈగ వాలినా ఊరుకునే ప్రసక్తే లేదని కూటమి ప్రభుత్వ శ్రేణులను అనిల్‌కుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో పెదపారుపూడి మండలం ఎంపీపీ గోగం సురేష్, ఎంపీటీసీ సభ్యులు రజని కుమారి, వేమూరి మోహన్, చిగురిపాటి అశోక్‌కుమారి, జాజుల శ్రీనివాసరావు, పద్మ, సర్పంచ్‌లు శివరామ్, గోళ్ల సోమేశ్వరరావు, నీలపాల పేరేసు, నగుళ్ల శ్రీనివాసరావు, కొమ్మా బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిపై సిబ్బంది ఫిర్యాదు

మొవ్వ: మొవ్వ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.వేదరాజ్ హాస్పిటల్ సిబ్బందిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ సిబ్బంది ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ హాస్పిటల్ ఉద్యోగులను గౌరవించకపోగా వైద్యశాలకు వచ్చే రోగుల ముందు చులకనగా మాట్లాడి కించపరుస్తున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కూడా లీవ్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. స్టాఫ్ అటెండెన్స్ రిజిస్టర్‌లో కావాలనే ఆబ్‌సెంట్ వేస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యను జిల్లా వైద్యాధికారి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ భగవాన్, సూపర్‌వైజర్లు బి.విజయ్‌కుమార్, విజయ్‌కుమారి, సీహెచ్‌ఓ డి శంకర్రావు, పీహెచ్ఎన్ శ్రీలక్ష్మిల, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంపీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

మొవ్వ పీహెచ్‌సీలో బహిరంగ విచారణ



వైద్యాధికారి వేదరాజ్ సమక్షంలో విచారణ చేపట్టిన డీఎంహెచ్‌ఓ గీతాబాయి

మొవ్వ: స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.వేదరాజ్‌పై సిబ్బంది చేసిన ఆరోపణలపై జిల్లా వైద్యాధికారి డాక్టర్ జే గీతాబాయి మంగళవారం రాత్రి పీహెచ్‌సీ ప్రాంగణంలో వైద్యాధికారి సమక్షంలోనే బహిరంగ విచారణ నిర్వహించారు. సీహెచ్‌ఓ, పీహెచ్ఎన్‌లు, ఎంపీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు తమ గోడుని డీఎంహెచ్‌ఓ వద్ద వెళ్లబుచ్చుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో పర్మిషన్, సెలవుగాని డాక్టర్ ఎం.వేదరాజ్ ఇవ్వకుండా ఇబ్బంది పెడతారన్నారు. దీనిపై డీఎంహెచ్‌ఓ గీతాబాయి డాక్టర్ వేదరాజ్‌ను వివరణ కోరగా తనను సిబ్బంది తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని 53 మంది సిబ్బంది మనోభావాలు దెబ్బతినే విధంగా డాక్టర్ వ్యవహరించటం సరికాదన్నారు. విచారణ పూర్తయిన అనంతరం డాక్టర్‌ను సెలవులో ఉండాల్సిందిగా ఆదేశిస్తూ తదుపరి నిర్ణయాన్ని ఉన్నతాధికారులతో చర్చించి ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ విచారణలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సాయికిరణ్, ఎన్‌హెచ్‌ఆర్ఎం ప్రోగ్రామ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగులచవితి



గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వద్ద నాగేంద్రస్వామి ఆలయంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



పామర్రులోని నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



కైకలూరు కాల్వగట్టు పుట్ట వద్ద పాలు పోస్తున్న భక్తులు

గుడివాడరూరల్: నాగుల చవితి పర్వదినాన్ని గుడివాడ పట్టణంలో మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం వద్ద వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి తరలిరావడంతో భక్తజన సందోహంతో ఆలయం కిక్కిరిసింది. పెద ఎరుకపాడులోని నాగేంద్రస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.

గుడివాడ మండలంలో..

మండలంలోని పర్నాసలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నాగులచవితి ఘనంగా నిర్వహించారు. మోటూరు, దొండపాడు, రామనపూడి తదితర గ్రామాల్లో నాగులచవితి జరుపుకున్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి చవితి సందర్భంగా భక్తులు పోటెత్తారు. గురజ శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వైఎస్సార్ సీపీ నాయకులు చవితి సందర్భంగా పూజలు చేశారు. నాయకులు శీలం రామకృష్ణ, రాధా, గణేష్, విష్ణువర్ధన్, వసంతరావు, సుబ్బారావు, రామకృష్ణ, సుధాకర్, సతీష్, పృథ్వీ పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: నాగులచవితి సందర్భంగా మండలంలోని మంటాడ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, కపిలేశ్వరపురం శివారు లంకతోటలోని శ్రీపాపవినాశేశ్వరస్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి.

పామర్రులో..

పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయం, బుచ్చమ్మతల్లి ఆశ్రయంలోని నాగేంద్రస్వామి ఆలయంలోని పుట్టల్లో భక్తులు ఆవు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రస్వామి ప్రసాదంగా పుట్ట మన్నును స్వీకరించారు. మండలంలోని కొమరవోలు, జమీదగ్గుమిల్లి, రావర్ల, బల్లిపర్రు, జుజ్జువరం, అడ్డాడ తదితర గ్రామాల్లోని నాగేంద్రస్వామి పుట్టల వద్ద మహిళలు బారులు తీరి పూజలు చేశారు.

కైకలూరులో..

కైకలూరు: స్థానిక కాల్వగట్టు వద్ద సంతాన నాగేంద్రస్వామి ఆలయం వద్ద అర్చకులు చావలి శంకర శాస్త్రి ఆధ్వర్యంలో చవితి వేడుక మంగళవారం నిర్వహించారు. చిన్నచెరువుగట్టు సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు.

పెదపారుపూడిలో..

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితిని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని వానపాముల పొలిమేర వద్ద ఉన్న నాగేంద్ర స్వామి ఆలయ పుట్ట వద్ద పాలు పోసేందుకు భక్తులు బారులు తీరారు.

పెదపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడి, పెదపూడి, అయ్యంకి, మొవ్వ, గూడపాడు, కోసూరు, కాజ గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన పుట్టలు ఉన్నాయి. భక్తులు వేరే ప్రాంతాల నుంచి వచ్చి నాగేంద్రస్వామికి పూజలు చేశారు.

మండవల్లి: మండవల్లిలోని నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పుట్టలో నాగుల చవితి సందర్భంగా మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కార్తికమాస పూజలు

మండవల్లి: మండలంలోని ఆలయాల్లో మంగళవారం కార్తికమాస పూజలు నిర్వహించారు. మండలంలోని కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం, శోభనాద్రిపురం విశ్వేశ్వరస్వామి ఆలయం, మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్త వీధిలైట్ల ఏర్పాటు

మండవల్లి: పంచాయతీ పరిధిలో దెబ్బతిన్న వీధిలైట్ల స్థానంలో మంగళవారం సర్పంచ్ మెండా ఝాన్సీ కొత్త వీధిలైట్లు వేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ

మండవల్లి: లోకుమూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో భవిత స్పెషల్ స్కూల్లో దివ్యాంగ చిన్నారులకు మంగళవారం డాక్టర్ సునీత ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. ఎంఈఓ రామారావు ఆధ్వర్యంలో పది మంది చిన్నారులకు ఫిజియోథెరపీ చేసి వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు.

కోడిపందేలపై దాడులు

చినపారుపూడి(పెదపారుపూడి): మండలంలోని చినపారుపూడి శివారు ప్రాంతంలో జరుగుతున్న కోడిపందేల శిబిరంపై మంగళవారం దాడులు నిర్వహించిన్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి రూ.18 వేలు నగదు, రెండు బైకులు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

కైకలూరు: గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ వి.రాంబాబు హెచ్చరించారు. గోనెపాడులో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో మంగళవారం దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు, ఎనిమిది సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

న్యాయం చేయడమే లక్ష్యం

గూడపాడు(మొవ్వ): రీ సర్వేలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారం అందించి దరఖాస్తుదారులకు న్యాయం చేయటమే గ్రామ సభల లక్ష్యం అని రీ సర్వే డెప్యూటీ తహసీల్దార్ పసుపులేటి జగన్మోహన రావు పేర్కొన్నారు. మొవ్వ మండలం గూడపాడులో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామ సర్పంచ్ తాతా ఉగాది లక్ష్మి, మండల సర్వేయర్ కిషోర్, పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్, సచివాలయ సర్వేయర్ లలిత, వీఆర్వో నాగమణి పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు

గుడివాడరూరల్: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తప్పవని గుడివాడ టూటౌన్ ఎస్ఐ జాస్మిన్ పేర్కొన్నారు. పట్టణంలోని సాయి ఉషోదయ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుడివాడ పరిసర ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్ నివారించేందుకు ప్రత్యేక మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. బాలికలు, మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

మండవల్లి: ప్రకృతి వ్యవసాయం మరింత విస్తరించాలని ఏడీఏ జి.వెంకటమణి పేర్కొన్నారు. మండలంలోని కొర్లపాడులో దేశీవెరైటీ (మైసూర్ మల్లికా) వరి పొలంలో పంటకోత ప్రయోగం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటి కాంతమ్మ మాట్లాడుతూ దేశీవెరైటీ ప్రస్తుతం పంటకోత ప్రయోగంలో 20 బస్తాల అంచనా దిగుబడి వచ్చిందన్నారు. సిబ్బందికి ఏడీఏ వెంకటమణి పలు సూచనలు చేశారు. నాచురల్ ఫామింగ్ అసోసియేషన్ మధు, మండవల్లి, ముదినేపల్లి మండలాల ఇన్‌చార్జిలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాలు స్వీకరిస్తాం

గుడ్లవల్లేరు: మండలంలోని పురిటిపాడులో రీసర్వే గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఈ సభలో మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ రీసర్వేలో రైతుల అభ్యంతరాలను స్వీకరించి, ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాగిత నరేంద్ర పాల్గొన్నారు.

పనులపై అవగాహన

గుడ్లవల్లేరు: ఉపాధి హామీ పథకం కింద గుడ్లవల్లేరు మండలంలోని చంద్రాల, చినగొన్నూరు, శేరీ దగ్గుమిల్లి, పురిటిపాడు, విన్నకోట, కట్టవానిచెరువు గ్రామాల్లో ఉపాధి ఏపీఓ పి.రాంప్రసాద్ గ్రామ సభలను నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఆయా గ్రామాల్లో నిర్వహించబోయే పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన సభలో తహసీల్దార్ మాట్లాడారు. రైతులకు ఇబ్బంది లేకుండా రీసర్వే సమస్యలను త్వరతగతిన పూర్తి చేస్తామన్నారు. గుడివాడ డివిజన్ రీసర్వే అధికారి జేజి బాబు, మండల రీసర్వే డీటీ సుందరరావు పాల్గొన్నారు.